క్లుప్తంగా

విజయసంకల్పయాత్రను జయప్రదం చేయండి

కలిగిరి: జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో శుక్రవారం నిర్వహించే విజయసంకల్పయాత్రకు కలిగిరి మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డితో జమ్మలపాళెంలో పార్టీ నియోజకవర్గ ముఖ్యనాయకుల పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించారని, రానున్న ఎన్నికల్లో ఈ సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. గురువారం చేజర్లలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, వార్డు మెంబర్ వంటేరు సుధీర్‌రెడ్డి, బాలయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు

సోమశిల: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 సంవత్సరాల వయస్సు నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేలా అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ నరసింహారావు తెలిపారు. అనంతసాగరంలోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చుకోవడానికి, ఒకచోట నుంచి మరోచోటికి ఓటు బదిలీ చేసే అవకాశం ఉందన్నారు. ఓటు నమోదుకు ఏప్రిల్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేలా గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గిరీష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల నియమావళి పాటించాలి



రేషన్ డీలర్లతో సమావేశమైన తహసీల్దార్

మనుబోలు : ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని, రేషన్ డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రాజకీయ నాయకుల ప్రచారంలో పాల్గొనరాదన్నారు. తమ విధులను పారదర్శకంగా నిర్వర్తించాలని సూచించారు. లబ్ధిదారులందరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీటీలు శ్రీకాంత్‌రెడ్డి, శివప్రసాద్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన సుధీర్‌తో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో ఇప్పటివరకు టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న భీమతాటి సుధీర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొట్టు విజయ్, షేక్ ఖాజా మొహిద్దీన్, చింతగుంట నాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే ఉజ్వల భవిష్యత్



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ఐదేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించారని, జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మర్రిపాడు మండలం చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలోని కదిరినేనిపల్లి, నెర్దనంపాడు, పోలిరెడ్డిపల్లి, చిన్నమాచనూరు గ్రామాల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నిర్వహించిన విజయోత్సవయాత్రలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో సైతం ప్రస్తుత జగనన్న పాలనలో ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఉత్తమ బోధనతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారన్నారు. ఈ పంచాయతీ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల రూపంలో 4,875 మంది లబ్ధిదారులకు రూ.18.79 కోట్లు అందజేశామని తెలిపారు. జగనన్న లేఅవుట్‌లో 39 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, సొంత స్థలం కలిగిన 11 మందికి ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రెండు దేవాలయాల నిర్మాణాలకు రూ.20 లక్షలు అందజేసినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు రూ.40 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. 236 మంది రైతులకు సంబంధించి 403 ఎకరాల్లో భూసమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తెలిపారు. చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలో ఐదు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అవసరమైన సిమెంటు రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలతోపాటు శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర పనులన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు. నెర్దనంపాడు, పోలిరెడ్డిపల్లి చెరువులకు సంబంధించి కాలువ నిర్మాణాలతోపాటు కదిరినేనిపల్లి చెరువుకు హైలెవల్ కాలువ ద్వారా నీటి సరఫరా తదితర పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి మా బాధ్యత

మర్రిపాడు ప్రాంత అభివృద్ధికి మేకపాటి కుటుంబం ఎంతో చేసిందని, విద్యాభివృద్ధికి సొంత స్థలాలను అందజేశామని, కృష్ణాపురంలో ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయం నుంచి వందలాది మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. హైలెవల్ కెనాల్ ఏర్పాటుకు మేకపాటి కుటుంబం ఎంతగా శ్రమించిందో అందరికీ తెలుసునన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, అంబటి కృష్ణారెడ్డి, రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్‌పూర్ సర్పంచ్ కృష్ణారెడ్డి, చిన్నమాచనూరు సర్పంచ్ నరసింహారావు, ఒంగోలు శ్రీనివాసులరెడ్డి, గుంటుపల్లి రమేష్‌నాయుడు, ఆకుల నరసింహారెడ్డి, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వెంగళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తా



ఉదయగిరిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: మేకపాటి కుటుంబం 43 ఏళ్లుగా ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తోందని, ఈ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్, కొళ్లవీధిలో గురువారం ఆయన విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మా మద్దతు అని మహిళలు తెలపడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో విద్యాపరంగా మంచి అవకాశాలు కల్పించేందుకు తన సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి నవోదయ, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.250 కోట్ల విలువ చేసే మేకపాటి కుటుంబ ఆస్తులను నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చామని గుర్తుచేశారు. త్వరలో వెలుగొండ ప్రాజెక్టు జలాలు ఉదయగిరి మెట్టప్రాంతాలకు రానున్నాయని, తద్వారా బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయని తెలిపారు. ఈ జలాలను ఉదయగిరి ప్రాంతానికి తీసుకురావడంలో తన సోదరుడు రాజమోహన్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. టీడీపీ నేతలు, ఎల్లోమీడియా చేసే అసత్య ప్రచారాలను నమ్మకుండా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఖాన్‌సావలి దర్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, నేతలు మూలె వినయ్‌రెడ్డి, మూలె వెంకటసుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, సలీం, గొల్లపల్లి తిరుపతి, అక్కి భాస్కర్‌రెడ్డి, ముర్తుజాహుస్సేన్, ఉప్పుటూరి శ్రీను, ఎం.వీరారెడ్డి, జి.వెంగళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఆర్యవైశ్యుల మద్దతు



మాట్లాడుతున్న నుడా చైర్మన్ ద్వారకానాథ్



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆర్యవైశ్యులు

ఆత్మకూరు: ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో అప్పట్లో వైఎస్సార్‌కు, అనంతరం జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకి ఆర్యవైశ్యులు మద్దతుగా నిలుస్తున్నారని నుడా చైర్మన్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆర్యవైశ్యులతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో గతంలో మేకపాటి గౌతమ్‌రెడ్డికి రెండుమార్లు ఆర్యవైశ్యులు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. జిల్లా పేరును అమరజీవి త్యాగానికి గుర్తుగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్పు చేసి ఆర్యవైశ్యుల కోరిక నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. అదే క్రమంలో రాష్ట్రంలోని పలు కన్యకాపరమేశ్వరి ఆలయాలు, అమ్మవారిశాలలు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించుకొనేలా చర్యలు తీసుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో గతంలో ఎన్నడూలేని విధంగా పలు సంక్షేమ పథకాలు ఆర్యవైశ్యులకు వర్తించాయన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడు అని, ఆయన ఆధ్వర్యంలో ఆత్మకూరు సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఇప్పటికే ప్రజలకు నమ్మకం కుదిరిందన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపార వ్యవహారాల్లో నిమఘ్నమై ఉండే ఆర్యవైశ్యులు రాజకీయంగా ప్రశాంతమైన పాలన కావాలని కోరుకుంటారని, అది వైఎస్ జగనన్న సారథ్యంలో నెరవేరిందన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని అభివృద్ధి చేసేందుకు ఓ టీము సహకారంతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఏడీఎఫ్ ద్వారా ఇప్పటికే బస్టాండ్‌తోపాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, తాగునీటి వసతి తదితర సౌకర్యాలు ప్రజలకు కల్పించినట్లు తెలిపారు.

పార్టీలో చేరిక

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ద్వారకానాథ్‌ల సమక్షంలో పలువురు ఆర్యవైశ్య యువకులు వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధి కోసం, అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్ ప్రణీత్, ఐవీ రమణారెడ్డి, ఆర్యవైశ్య యూత్ దోర్నాదుల లక్ష్మణ్, చిన్ని సుధీర్, శ్రీరామ్ సురేష్, సత్యనారాయణ, జి.సురేష్ బాబు, ఇందూరు వంశీధర్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల మద్దతు



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మద్దతు తెలిపిన కావలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణులు

కావలి: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణులంతా గురువారం మద్దతు ప్రకటించారు. తాళ్లపాళెం సత్యం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణులంతా మంగళ వాయిద్యాలతో పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. మేళతాళాలతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మద్దతు తెలిపి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు మాట్లాడుతూ రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి మద్దతుగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీబ్రాహ్మణులకు అభినందనలు తెలిపారు. వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారిణి గీతారెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షయ వ్యాధి గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే సమీపంలోని వైద్యశాలలో వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్యుల పర్యవేక్షణలో తగిన మందులు వాడాలని తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ తిరుపతిరావు, ఎస్‌టీఎస్ షబీర్, ఎస్‌టీఎల్ఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలుకుదాం



మాట్లాడుతున్న మాలకొండారెడ్డి తదితరులు

జలదంకి: వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి మండలంలోని జమ్మలపాళెం నుంచి భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలుకుదామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జలదంకిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మలపాళెం నుంచి బ్రాహ్మణక్రాక వరకు 1000 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణక్రాకలో నిర్వహించనున్న బహిరంగ సభను మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కావలి కాలువ ద్వారా వచ్చే సాగునీటి విషయంపై టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌తోపాటు కొంతమంది టీడీపీ నాయకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జలదంకి మండల రైతులకు సాగునీరు ఇవ్వాలన్న సంకల్పంతో రాజగోపాల్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండుసార్లు కలిసి ఈ ప్రాంతానికి సాగునీరు ఇవ్వాలని పట్టుబట్టి తీసుకొచ్చారని గుర్తుచేశారు. టీడీపీ శ్రేణులు అసత్య ప్రచారాలు చేస్తే రైతులు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, నురె వెంకటశేషారెడ్డి, వాకా మాధవరెడ్డి, గండు వెంకారెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, వాకా శ్రీనివాసులురెడ్డి, కమతం సుబ్బారావు, గమ్మలంపాటి సుబ్బారావు, ఒంగోలు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పడమర గుడ్లదొనలో 'ఆరోగ్య సురక్ష'

కలిగిరి: మండలంలోని పడమర గుడ్లదొనలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి గీతారెడ్డి గురువారం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అనుమసముద్రంపేట: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి మరలా అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని ఏఎస్‌పేట మైనారిటీ నాయకుడు సయ్యద్ కాలేషా ఆధ్వర్యంలో తమిళనాడులోని నాగూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంతియాజ్, మసూద్, కరిముల్లా, సాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి



సంగంలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథరెడ్డి తదితరులు

సంగం: సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీ గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సంగం మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శివాలయం సెంటర్, ఆంజనేయస్వామి దేవస్థానం సెంటర్‌లలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంగం క్లస్టర్ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్థానికేతరులే దిక్కు



తిరుపతిలో స్థిరపడిన గూడల వెంకటాచలానికి టీడీపీ కండువా కప్పుతున్న కావ్య కృష్ణారెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మొహం చూసే వాళ్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారిని తీసుకువచ్చి కండువాలు కప్పుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన మెట్టుకూరు అమరజీవిరెడ్డికి కావలిలో టీడీపీ కండువా కప్పి నవ్వులపాలైన విషయం తెలిసిందే. ఈ డ్యామేజీని కవర్ చేసేందుకే తెలుగు తమ్ముళ్లు నానా కష్టాలు పడుతుంటే, కావలి నుంచి తిరుపతికి వెళ్లి 30 ఏళ్లుగా అక్కడే స్థిరపడిన గూడల వెంకటాచలం ముదిరాజ్‌కు తాజాగా టీడీపీ కండువా కప్పి పార్టీలో చేరుతున్నట్లు కావ్య కృష్ణారెడ్డి ఫొటో సెషన్ పెట్టడంతో టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గానికి సంబంధం లేని వారిని తీసుకువచ్చి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించడం పార్టీకి తీవ్రనష్టం కలిగిస్తోందని వాపోతున్నారు. కావ్య వైఖరితో కావలిలో ఇప్పటికే పార్టీ దాదాపుగా ఖాళీ కావొచ్చిందని నాయకులు చెబుతున్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి పార్టీనే నమ్ముకున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా కావ్య కృష్ణారెడ్డి విధానాలు, మాటలు నచ్చక పార్టీని వదిలి వెళుతున్నారు. ఇదే సమయంలో పొత్తులో భాగంగా టీడీపీ మద్దతు పలికిన పవన్ అభిమానులను కూడా జనసేన జెండా వదిలి టీడీపీలోకి రావాలని ఒత్తిడి తెస్తుండడంతో వారు కావ్య కృష్ణారెడ్డి దెబ్బకు తారెత్తిపోతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేరుతున్నట్లు కావ్య ఆడిస్తున్న డ్రామాలు పార్టీని మరింత నవ్వులపాలు చేస్తున్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాల కవాతు



అల్లూరు: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



సోమశిల: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

అల్లూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అల్లూరు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక కేంద్ర బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బలగాల ద్వారా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అల్లూరు, సింగపేట, ఇస్కపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు.

సోమశిల, పీకేపాడులో పోలీసు కవాతు

సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల్లో ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు, సోమశిల ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిరంతర నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.